కావాల్సింది కొండంత.. సరఫరా గోరంత!



పైర్లను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. అడపాదడపా వర్షాలు పడుతుండటంతో ఇదే అదునులో వేయాల్సిన యూరియా కోసం రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. యూరియా కొరతే లేదంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం.. మండలానికి 71 వేల బస్తాలు అవసరం కాగా ఇప్పటి వరకు కేవలం 22484 బస్తాలను మాత్రమే సరఫరా చేసింది. మిగతా యూరియా రేపుమాపు అంటూనే కాలయాపన చేస్తుండటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అసలు వస్తుందా రాదా అని కొందరు అనుమానం వ్యక్తం చేస్తుండగా.. వచ్చినా అందరికి దొరికేనా అని మరికొంతమంది దిగులు చెందుతున్నారు.

– బండి ఆత్మకూరు

- యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న రైతులు
- నేడు, రేపు అంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన

బండిఆత్మకూరు మండలంలో 33 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. ఇందులో 27 వేల ఎకరాల్లో వరి, 6 ఎకరాల్లో మెట్ట పైరును సాగు చేస్తున్నారు. మండలానికి 77 వేల బస్తాల యూరియా అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయితే ఇప్పటివరకు 22,484 బస్తాలు మాత్రమే సరఫరా కావడంతో కొంతమంది రైతులకు మాత్రమే యూరియా దొరికింది. మిగతా రైతులకు త్వరలో వచ్చే యూరియా బస్తాలు సరఫరా చేస్తాంటూ అధికారులు చెప్పుకొచ్చారు. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి యూరియా రాకపోవడం.. దళారులు అధిక ధరలకు విక్రయిస్తుండటంతో ఆర్థిక పరిస్థితి బాగోలేని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం ఇటు యూరియాను సరఫరా చేయకుండా అటు దళారీల అధిక ధరలను నియంత్రించకుండా చేష్టలుడిగి చూస్తున్నారు.



యూరియా కావాలని ఆర్‌బీకేలో అధికారిని కోరుతున్న రైతులు (ఫైల్)

ఎప్పుడిస్తారో?



30 ఎకరాల పలుకు సాగు చేస్తున్నాను. నాకు ఇంతవరకు ఆర్‌బీకే నుంచి ఒక బస్తా యూరియా కూడా ఇవ్వలేదు. మా ఊరిలోనే వేరే రైతు నుంచి ఒక బస్తా యూరియా ధర రూ.530 పెట్టి కొని పొలానికి వేసుకున్నాను. యూరియా ఉన్నప్పుడు మాకు కావాలని వ్యవసాయ అధికారిని అడిగితే మీ సీరియల్ నెంబర్ ఇంకా రాలేదని చెప్పారు. మా నంబర్ ఎప్పుడొస్తుందో? యూరియా ఎప్పుడిస్తారో ఆ దేవుడికే తెలియాలి.

– మల్లు స్వామి రెడ్డి, రైతు, ఎర్రగుంట్ల గ్రామం

ఒక్క బస్తా కూడా ఇవ్వలేదు



నేను 40 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. నాకు ఇంతవరకు ఒక్క బస్తా యూరియా ఇవ్వలేదు. మా గ్రామంలోనే కొందరి వద్ద బస్తాలు బస్తాల యూరియా ఉంది. మాకు మాత్రం ఒక్క బస్తా ఇవ్వడానికి అధికారులకు మనసొప్పడం లేదు. కొద్దిరోజులు చూసి అధిక ధర అయినా దళారుల వద్ద కొందామనుకుంటున్నాను. తప్పదు మరి. పైర్లను కాపాడుకోవాలి కదా.

– సుబ్బారెడ్డి, రైతు, ఎర్రగుంట్ల గ్రామం

త్వరలోనే యూరియా వస్తుంది

మండలంలో ఉన్న ఒక్కో రైతు భరోసా కేంద్రానికి 10 టన్నుల చొప్పున నేడో, రేపో యూరియా వస్తుంది. అంతరకు రైతులు వేచి ఉండాలి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదురు. – ఏఓ పవన్ కుమార్

క్లుప్తంగా

విశేష పూజలు



వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం,గంధోదకం, పుష్పోదకం, కలశోదకం , శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

పాములపాడు: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేష్‌బాబు అన్నారు. బుధవారం కర్నూలు -గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోల్లో కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పాములపాడు: ఎరువులను ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ సుభద్రమ్మ, మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డిలు అన్నారు. బుధవారం మండలంలోని వాడాల గ్రామంలో శ్రీజ్యోతి ఫెర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేశారు. ఎరువుల గోదాములు , రికార్డులను పరిశీలించి స్టాక్ సరిచూశారు. వారి వెంట వీఆర్వో మద్దిలేటి ఉన్నారు.

ఉద్యాన పంటల టార్గెట్ పూర్తి చేయాలి

పాములపాడు: మండలంలో ఉద్యాన పంటల సాగు టార్గెట్ పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఉద్యాన పంటలు 80 ఎకరాల్లో సాగు చేయాలని టార్గెట్ నిర్దేశించడమైందన్నారు. అయితే ఇప్పటి వరకు 70 ఎకరాల్లో సాగు చేస్తున్నారని, మిగిలిన 10 ఎకరాల్లో కూడా పంటలు వేయించాలని ఆదేశించారు. అలాగే కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఏపీఓ జయంతి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న ఏఓ మురళీధర్

పగిడ్యాల: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడుకోవాలని వ్యవసాయ అధికారి మురళీధర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పేడ, పచ్చి రొట్ట ఎరువులను వేసుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. పంట మార్పిడి పద్ధతులు పాటించాలన్నారు. నాణ్యమైన రకం విత్తనాలను ఎంపిక చేసుకుని సూచించారు. ప్రస్తుతం వర్షాల వల్ల పైర్లలో నిలిచిన నీటిని బయటకు పంపి సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

హామీలను నెరవేర్చాలి



హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

పగిడ్యాల: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు నెరవేర్చకపోవడం తగదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పుట్ట విజయుడు విమర్శించారు. బుధవారం స్థానిక దేవనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏ,బీ,సీ,డీ వర్గీకరణ కోసం పోరాటాలు చేసిందన్నారు. ఉమ్మడి రిజర్వేషన్‌ల కారణంగా మాదిగలకు అన్యాయం జరిగి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వివక్షకు గురైనట్లు వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఏడు శాతం రిజర్వేషన్‌ల చట్టం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలుపాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఈశ్వరయ్య, మండల అధ్యక్షులు రమణ, ఉపాధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి జి.రాజు, కార్యదర్శి విజయుడు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగ బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న అనిల్ కుమార్ గుప్తా

శ్రీశైలంటెంపుల్: భారత దేశంలోని 12 ప్రసిద్ధ జ్యోతిర్లింగాలను కలిపి ప్రత్యేక జ్యోతిర్లింగ బోర్డును ఏర్పాటు చేయాలని జ్యోతిర్లింగ బోర్డు బనావో అభియాన్ సమితి జాతీయ సమన్వయకర్త, సుప్రీంకోర్టు న్యాయవాది అనిల్‌కుమార్ గుప్తా డిమాండ్ చేశారు. బుధవారం శ్రీశైలం చేరుకున్న ఆయన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్‌గుప్తా మీడియా మాట్లాడుతూ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఉన్న 11 జ్యోతిర్లింగాలను సందర్శించానని, ప్రస్తుత శ్రీశైల మల్లికార్జున స్వామివారి దర్శనంతో 12 జ్యోతిర్లింగాల యాత్ర పూర్తి అయిందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో పాటు, 12 జ్యోతిర్లింగాలు ఉన్న ప్రాంతాల లోక్‌సభ సభ్యులకు కూడా లేఖల ద్వారా జ్యోతిర్లింగ బోర్డు ఏర్పాటు చేయాలని వివరించానన్నారు. జ్యోతిర్లింగ బోర్డు ఏర్పాటైతే 12 జ్యోతిర్లింగాల వద్ద రోడ్డు, రైల్వే, వైమానిక సౌకర్యాలు మెరుగుపడి, యాత్రికులకు ప్రయాణీ సులభంగా ఉంటుందన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు 104 వాహనం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మహమ్మద్ బేగ్ సూచించారు. బుధవారం గోలకొండ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరము, దగ్గు, జలుబు, ఒళ్ళు నొప్పులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

ఎరువు దుకాణాల తనిఖీ



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరు: మండలంలోని శివ ట్రేడర్స్, మన గ్రోమోర్ సెంటర్ ఎరువుల దుకాణాలను మంగళవారం తహసీల్దార్ రత్నరాధిక, ఏఓ హేమలత తనిఖీ చేశారు. ఎరువుల దుకాణంలోని స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్‌లను పరిశీలించారు. రైతులకు అధిక ధరలకు ఎరువులును అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. అలాగే ఎరువుల గోడౌన్‌ను పరిశీలించారు. అనుమతి లేని ఎరువులును విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

స్వామిత్వ సర్వేను పూర్తి చేయండి



ప్రాతకోటలో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ అన్వరాబేగం

పగిడ్యాల: స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలని ఆత్మకూరు డీఎల్‌డీఓ అన్వరాబేగం సూచించారు. బుధవారం ఆమె మండలంలోని లక్ష్మాపురం, పగిడ్యాల, ప్రాతకోట గ్రామాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తీస్తున్న బిల్డింగ్ కొలతలను తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పాటు ఇతర అధికారులతో కౌసల్యము, బయోమెట్రిక్ అటెండెన్స్ తదితర ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి



ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వారి ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి సూచించారు. బుధవారం మండలకేంద్రంలో ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తున్నందున మురుగునీరు నిల్వ ఉండకుండా, దోమలు వ్యాపించకుండా వేస్టుఆయిల్ లేదా, డీజిల్, పెట్రోల్ వంటి వాటిని మురికినీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె బాలయ్య, పంచాయతీ కార్యదర్శి మణికంఠ పాల్గొన్నారు.

రేపటి నుంచి యూరియా పంపిణీ

జూపాడుబంగ్లా: ఈనెల 5 నుంచి రైతుసేవా కేంద్రాలు, సహకార సొసైటీ, ప్రైవేటు డీలర్ల ద్వారా యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏఓ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మండలానికి మొదటి విడతగా 200 టన్నుల యూరియా కేటాయించినట్లు తెలిపారు.

వాహన మిత్ర అమలు చేయాలి

ఆత్మకూరు: ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం అమలు చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సద్దాం, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రత్యామ్నాయంగా వారికి వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.30 వేల చొప్పున ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు రణధీర్, మల్లయ్య, రవి, శ్రీను, రమణ, బుజ్జి, సయ్యద్‌బాషా, వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రోత్సాహం

మహానంది: రసాయన, పురుగు మందులు లేకుండా సేంద్రియ పద్ధతుల్లో వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసే రైతులకు సేంద్రియ స్కోప్ సర్టిఫికెట్ వచ్చేలా ప్రోత్సహిస్తామని ఏఓ నాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం బొల్లవరంలో రైతులతో ఆయన మాట్లాడారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వెలుగోడు: పట్టణంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్, పొట్టి శ్రీరాములు సెంటర్, జెడ్పీ హైస్కూల్, పాతబస్టాండ్, అరుగులు తదితర ప్రాంతాల మీదుగా పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా తలెత్తిన చిన్న వివాదంపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినా, రెచ్చగొట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ప్రజలకు భరోసా కల్పించడం పోలీసుల కర్తవ్యమన్నారు. ర్యాలీలో ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్‌ఐ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ బాలుడెవరో?



దోర్నాల పోలీసు స్టేషన్‌లో ఉన్న బాలుడు

ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడు బుధవారం ప్రకాశం జిల్లా దోర్నాలలో ఒంటరిగా తిరుగుతూ కనిపించాడు. బాలుడు ఏడుస్తు ఉండడం ఒంటరిగా ఉండడం గమనించిన కొందరు అతన్ని విచారించి తప్పిపోయినట్లుగా గుర్తించి స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆరా తీయగా.. తన పేరు నరసింహ అని, తండ్రి పేరు మధు అని, తమది నంద్యాల జిల్లా ఆత్మకూరు అని చెబుతున్నాడు. బాలుడిని గుర్తించిన వారు తల్లిదండ్రులకు సమాచారమిచ్చి తమ వద్ద ఉన్న బాలున్ని తీసుకెళ్లాలని దోర్నాల పోలీసులు కోరుతున్నారు.

– ఆత్మకూరురూరల్

పంటలను కాపాడుకోండి

జూపాడుబంగ్లా: అధికవర్షాల వల్ల పంటలు దెబ్బతినకుండా కాపాడుకోవాలని హార్టికల్చర్ నియోజకవర్గ అధికారిణి తేజశ్విని రైతులకు సూచించారు. బుధవారం ఆమె తర్తూరు, నందికొట్కూరులలో రైతులు సాగుచేసిన టమాట, బంతిపూల తోటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోండి



వెదురు పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి చందన

ఆత్మకూరురూరల్: ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి కే.చందన రైతులకు సూచించారు. మండలంలోని నల్లకాల్వ గ్రామంలో ఉన్న వెదురు, ఉల్లి పంటలను ఆమె బుధవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తప్పకుండా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

4,038.67 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేశాం

నందికొట్కూరు: నియోజకవర్గానికి 4038.67 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేశామని వ్యవసాయ డివిజన్ అధికారి గిరీష్ తెలిపారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నందికొట్కూరు మండలంలోని రైతు సేవ కేంద్రాల ద్వారా 231.975 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ద్వారా 417.3 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ ఎరువుల డీలర్ల ద్వారా 1365.062 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. పగిడ్యాల మండలంలోని రైతు సేవ కేంద్రాల ద్వారా 144.27 మెట్రిక్ టన్నులు, సొసైటీల ద్వారా 212.62 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల నుంచి 373.67 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. మిడుతూరు మండలంలోని రైతు సేవ కేంద్రం ద్వారా 271.575 మెట్రిక్ టన్నులు, సొసైటీల ద్వారా 147.96 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా 126.078 టన్నులు సరఫరా చేశామన్నారు. జూపాడుబంగ్లా మండలంలోని రైతు సేవ కేంద్రాల ద్వారా 410.76 మెట్రిక్ టన్నులు, సొసైటీల ద్వారా 108.36 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా 229.8 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామన్నారు.

6న చలో విజయవాడ



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆత్మకూరు: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యేడాది పూర్తయినా విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బన్నీ, మనోజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పాములపాడు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ప్రతి రైతు తప్పని సరి నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మద్దూరు, వాడాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్దతు ధర, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట నష్ట పరిహారం పొందేందుకు పంట నమోదు తప్పనిసరిగా ఉండాలన్నారు.

యూరియా అందించలేని చేతకాని ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: రైతులకు యూరియా కూడా అందించలేని చేతకాని ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కోసం రైతులు ఆందోళనలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెట్టుబడి సాయంతో పాటు సమయానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించారని గుర్తు చేశారు. రైతుల సమస్యలను గాలికొదిలిన కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈనెల 9న ఆత్మకూరులోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున్న ధర్నా చేయనున్నట్లు చెప్పారు. కేంద్రం నుంచి వచ్చిన యూరియాను కూటమి నేతలు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. యూరియా దొరక్క పైర్లను కాపాడుకోలేక రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఫీజురీయింబర్‌మెంట్ అందక విద్యార్థులు, ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో రోగులు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇలా కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు సోమల సుధాకర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, నాయకులు నాగిరెడ్డి, తులసిరెడ్డి, వెంకటరమణ, మల్లికార్జునరెడ్డి, మన్సూర్ అహ్మద్, లోకేశ్వరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, రమణ, కోకిల రమణారెడ్డి, మాధురి, అబుబక్కర్, నబిరసూల్ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

జూపాడుబంగ్లా: రైతులు భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ సూచించారు. భాస్కరాపురం గ్రామంలోని సర్వేనెంబర్ 1, 2లలో సమస్యాత్మకంగా ఉన్న పొలాన్ని వారు బుధవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఉమాపతి, మండల సర్వేయర్ అతీఫ్ ఆధ్వర్యంలో సర్వే చేయించారు. అనంతరం ఆర్డీఓ నాగజ్యోతి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు పొలాల వద్ద సమస్యలు నెలకొన్నప్పుడు వాటిని పెద్దవిగా చేసుకోకుండా మానవతా దృక్పథంతో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ నాగన్న, వీఆర్వోలు బాలకృష్ణ, ఇన్‌చార్జ్ ఆర్ఐ మౌలాబాషా పాల్గొన్నారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి



పథకాల బ్రోచర్లను విడుదల చేస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: డబ్బు దుబారా చేయకుండా ప్రతి ఒక్కరూ పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని ఆంధ్రబ్యాంకు జూపాడుబంగ్లా బ్రాంచ్ మేనేజర్ కిశోర్‌బాబు సూచించారు. బుధవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పలు ప్రభుత్వ పథకాలపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, పొదుపు మహిళలకు, విద్యార్థులకు రుణాలు ఇస్తామన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు కూడా రుణాలు ఇస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీసోర్స్ పర్సన్‌లు శ్రీనివాస్, వెంకటేష్ కేంద్రప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం అంబమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ఉత్సవాలు ప్రశాంతం



డీఎస్పీ రామాంజినాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అందరి సహకారంతోనే వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని డీఎస్పీ రామాంజినాయక్ అన్నారు. గత నెల 29న వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం డీఎస్పీ రామాంజినాయక్, అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబులను సత్కరించారు. నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అపశృతులు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా కృషిచేసినందుకు వారు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అధికారులతోపాటు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సహకారంతోనే ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. కార్యక్ర మంలో ఉత్సవ సమితి సభ్యులు గరుడాద్రి సుదర్శన్, రాసంశెట్టి, చంద్రశేఖర్, శేగు కిరణ్‌కుమార్, ఆవుల రెడ్డి, వెంకటరమణ, విశ్వనాథ్, పవన్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎలుకలను నివారించుకోండి



ఎలుకల నివారణకు మందు తయారీని చూపిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఎలుకలను నివారించుకుని పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం సూచించారు. బుధవారం మండల పరిధిలోని శివపురంగ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఎలుకలను ఎలా నివారించుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల నివారణతో 10 శాతం పంట నష్టం తగ్గించవచ్చన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ పాల్గొన్నారు.